జ్వాల దశ

నిజం.. నిర్భయంగా..

WWW.DASHANEWS.COM

శనివారం
17-10-2026

సంపుటి 1 | సంచిక 325

పేజీలు : 04

వెల : 1/-

PRGI No : TGTEL/25/A4195



విజయ పాల ధరల పెంపు

అక్టోబర్ 17 నుంచి కొత్త ధరలు అమల్లోకి

4లో



జనసేన ప్రచార రథంను

ప్రారంభించిన పవన్ కళ్యాణ్

దశ, హైదరాబాద్: ఖమ్మం, నల్గొండ, వరంగల్ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో ప్రచారానికి సంబంధించిన జనసేన గ్రాడ్యుయేట్ ఎక్స్ప్రెస్ ప్రచారం రథంను జనసేన అధ్యక్షుడు పవన్ శుక్రవారం హైదరాబాదులో ప్రారంభించారు. వరంగల్, ఖమ్మం, నల్గొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ నియోజకవర్గానికి జనసేన అభ్యర్థిగా గడల శ్రీనివాసరావు విజయాన్ని ఆకాంక్షిస్తూ, సూచనలు చేశారు. ఈ గ్రాడ్యుయేట్ ఎక్స్ప్రెస్ కేవలం ఎన్నికల ప్రచార వాహనంగా కాకుండా, సమస్యలను నిరంతరం తెలుసుకునే ప్రజా సేవా వేదికగా కొనసాగాలని స్పష్టం చేశారు.



తెలంగాణలో హ్యుందాయ్ కం పెనీ

భారీ పెట్టుబడులు

జహీరాబాద్ నిమ్జ్‌లో రూ.8,528 కోట్లతో ఆర్ అండ్ డీ కేంద్రం

4,276 ఉద్యోగాల కల్పనే లక్ష్యం.. అన్ని విధాలా సహకరిస్తాం

హ్యుందాయ్ మోటార్స్ ఇండియా ప్రతినిధులతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

దశ, హైదరాబాద్: తెలంగాణలో తయారీ రంగం అభివృద్ధికి ప్రభుత్వం అన్ని విధాలా సహకరిస్తుందని ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి తెలిపారు. కార్ల తయారీ, ఆటోమొబైల్ పరిశోధన, అభివృద్ధి రంగాలకు హైదరాబాద్ అనువైన ప్రాంతమని హ్యుందాయ్ మోటార్స్ ఇండియా ఇంజినీరింగ్ ప్రతినిధి బృందానికి వివరించారు. ఎంసీఆర్ హెచ్‌ఆర్‌డీలోని బోధి పెవిలియన్‌లో HMIE మేనేజింగ్ డైరెక్టర్ చాంగ్యోన్ చో నేతృత్వంలోని ప్రతినిధి బృందం ముఖ్యమంత్రితో సమావేశమైంది. ఈ సందర్భంగా జహీరాబాద్‌లోని నేషనల్ ఇన్వెస్ట్‌మెంట్ అండ్ మాన్యుఫ్యాక్చరింగ్ జోన్ (నిమ్జ్)లో ఏర్పాటు చేయనున్న సమగ్ర అంతర్జాతీయ ఆర్ అండ్ డీ కేంద్రం పురోగతిపై చర్చించారు. ప్రాజెక్టు పనులను వేగవంతం చేసేందుకు అవసరమైన సహకారం అందిస్తామని సీఎం హామీ ఇచ్చారు. ఈ ప్రాజెక్టు కోసం రూ.8,528 కోట్ల పెట్టుబడి పెట్టాలని సంస్థ లక్ష్యంగా పెట్టుకుంది. 678 ఎకరాల్లో దశలవారీగా అభివృద్ధి చేయనున్న ఈ కేంద్రం ద్వారా 4,276 ఉద్యోగాలు కల్పించాలని ప్రతిపాదించింది. రానున్న నెలల్లో శంకుస్థాపనకు సిద్ధం చేయనున్నట్లు

..మిగతా 4వ పేజీలో ➔

కాంగ్రెస్ నిర్లక్ష్యంతోనే నీటి ఎద్దడి!

ప్రాజెక్టుల పంపులు ఆన్ చేయలేదు.. నీటిని వృథాగా వదిలేశారు: కేటీఆర్



దశ, హైదరాబాద్: తెలంగాణలో నెలకొన్న నీటి ఎద్దడికి ప్రకృతి వైపరీత్యాల కంటే కాంగ్రెస్ ప్రభుత్వ నిర్లక్ష్యమే కారణమని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆరోపించారు. ప్రాజెక్టుల పంపులను సకాలంలో ఆన్ చేయకుండా, నీటి నిల్వలపై ముందస్తు ప్రణాళికలు రూపొందించకుండా ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించిందని సోషల్ మీడియా వేదికగా విమర్శించారు. జూన్ 1 నుంచి ఇప్పటివరకు 750 టీఎంసీలకు పైగా గోదావరి జలాలు, 250 టీఎంసీల కృష్ణా జలాలు సముద్రంలోకి, దిగువ ప్రాంతాలకు వెళ్లిపోయాయని కేటీఆర్ పేర్కొన్నారు. కన్నెపల్లి, దేవాదుల పంపులను సక్రమంగా వినియోగించి ఉంటే గోదావరి పరివాహక ప్రాంతంలోని రిజర్వాయర్లు, చెరువుల్లో నీటిని నిల్వ చేసుకునే అవకాశం ఉండేదని అన్నారు. పాలమూరు-రంగారెడ్డి, కల్వకుర్తి ఎత్తిపోతల పథకాల పంపులను కూడా సకాలంలో ప్రారంభించలేదని ఆరోపించారు. ఎల్‌నినో ప్రభావంపై మార్చి నుంచే హెచ్చరికలు వచ్చినప్పటికీ ప్రభుత్వం ముందస్తు చర్యలు తీసుకోలేదని కేటీఆర్ విమర్శించారు. మరోవైపు, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం పట్టిసీమతో పాటు ఇతర ప్రాజెక్టుల

..మిగతా 4వ పేజీలో ➔



పంట నష్టానికి ఎకరాకు 10 వేల పరిహారం?

ఎల్‌నినోపై రేవంత్ సర్కార్ కసరత్తు!

దశ, హైదరాబాద్: ఎల్‌నినో ప్రభావంతో వర్షాభావ పరిస్థితులు ఏర్పడి పంటలు దెబ్బతిన్న రైతులను ఆదుకునేందుకు తెలంగాణ ప్రభుత్వం చర్యలు చేపట్టనున్నట్లు సమాచారం. పంట నష్టపోయిన రైతులకు ఎకరాకు రూ.10 వేల చొప్పున పరిహారం అందించే ప్రతిపాదనను ప్రభుత్వం పరిశీలిస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. అయితే దీనిపై

..మిగతా 4వ పేజీలో ➔

మార్నింగ్ వాక్‌లో మృత్యుఘోష!

డీసీఎం ఢీకొని ఇద్దరు మృతి.. మరొకరికి తీవ్ర గాయాలు

దశ, సూర్యాపేట: సూర్యాపేట జిల్లా బలేంల స్టేజీ వద్ద శుక్రవారం తెల్లవారుజామున ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. మార్నింగ్ వాక్‌కు వెళ్లిన ముగ్గురిని డీసీఎం వాహనం ఢీకొట్టడంతో గుర్రం సైదులు, ఆలకుంట నాగరాజు మృతి చెందగా, గొల్ల జానయ్య తీవ్రంగా గాయపడ్డారు. బలేంల గ్రామానికి చెందిన సైదులు, నాగరాజు, జానయ్య ఎప్పటిలాగే ఉదయం నడకకు వెళ్లారు. ఈ సమయంలో జనగామ వైపు నుంచి సూర్యాపేటకు వెళ్తున్న డీసీఎం వాహనం వారిని వెనుక నుంచి ఢీకొట్టింది. ప్రమాదంలో సైదులు అక్కడికక్కడే మృతి చెందారు. తీవ్రంగా గాయపడిన నాగరాజు, జానయ్యలను స్థానికులు సూర్యాపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. చికిత్స

..మిగతా 4వ పేజీలో ➔

ఆక్సీ-నౌ ప్లాంట్‌లో

సిలిండర్ పేలుడు

కార్మికుడు మృతి.. మరో ఇద్దరికి గాయాలు!

గడువు ముగిసిన సిలిండర్ల వినియోగంపై అనుమానాలు

భద్రతా ప్రమాణాలపై విచారణ

దశ, చౌటుప్పల్: యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ మండలం దండుమల్కాపురం గ్రీన్ ఇండస్ట్రియల్ పార్కులోని ఆక్సీనౌ (OxyNow) గ్యాస్ పరిశ్రమలో శుక్రవారం ఘోర ప్రమాదం చోటుచేసుకుంది. పరిశ్రమలో సిలిండర్ పేలడంతో బిహార్‌కు చెందిన కార్మికుడు మనీష్ కుమార్ మృతి చెందగా, మరో ఇద్దరు కార్మికులు గాయపడినట్లు సమాచారం . ఈ ఘటనతో పారిశ్రామికవాడలో కలకలం రేగింది. పరిశ్రమలో సిలిండర్లలో ఆక్సిజన్ నింపుతున్న సమయంలో పేలుడు సంభవించినట్లు ప్రాథమిక సమాచారం. పేలుడు తీవ్రతకు కార్మికుడు ప్రాణాలు కోల్పోయినట్లు తెలుస్తోంది. మరో ఇద్దరు కార్మికులు గాయపడినట్లు సమాచారం. పేలుడు ధాటికి మృతదేహం సుమారు 200 మీటర్ల దూరంలో పడినట్లు స్థానికులు అంటున్నారు. కాగా గడువు ముగిసిన సిలిండర్లలో గ్యాస్ నింపే సమయంలో ఒత్తిడిని తట్టుకోలేక పేలుడు సంభవించి ఉండవచ్చనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. అయితే సిలిండర్ల గడువు ముగిసిందా? సాంకేతిక లోపం వల్ల ప్రమాదం జరిగిందా? అనే అంశాలు అధికారికంగా నిర్ధారణ కావాల్సి ఉంది. ఈ ఘటన పరిశ్రమల్లో కార్మికుల భద్రతపై ప్రశ్నలు లేవనెత్తుతోంది. సిలిండర్ల నాణ్యత, వాటి పరీక్షలు, పీడన నియంత్రణ పరికరాల పనితీరు, భద్రతా నిబంధనల అమలుపై అధికారులు సమగ్రంగా పరిశీలించాల్సిన అవసరం ఉంది. ప్రమాదం జరగకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకున్నారా? యాజమాన్యం నిర్లక్ష్యం ఏమైనా ఉందా? అనే అంశాలు విచారణలో తేలాల్సి ఉంది. ఇప్పటివరకు కంపెనీ నిర్లక్ష్యం నిర్ధారణ అయినట్లు అధికారిక సమాచారం లేదు. ప్రమాద సమాచారం అందుకున్న చౌటుప్పల్ డీఎస్పీ మధుసూదన్ రెడ్డి

..మిగతా 4వ పేజీలో ➔






రబీ సాగుపై నీలినీడలు!

భూగర్భ జలాల పతనం.. బోర్లపై తగ్గిన భరోసా

పెట్టుబడులు పెట్టేందుకు వెనుకంజలో రైతులు.. ప్రత్యామ్నాయ పంటలే దిక్కు?

దశ, హైదరాబాద్: తెలంగాణలో వానాకాలం సాగును వర్షాభావ పరిస్థితులు దెబ్బతీయడంతో రాబోయే యాసంగి (రబీ) సాగుపై నీలినీడలు కమ్ముకుంటున్నాయి. వర్షాలు సరిగా కురవక భూగర్భ జలాలపై ఒత్తిడి పెరగడం, బోరుబావుల్లో నీటి లభ్యత తగ్గడం రైతులను ఆందోళనకు గురిచేస్తున్నాయి. ఇప్పటికే పెట్టుబడుల భారంతో సతమతమవుతున్న అన్నదాతలు మరోసారి పంటలు సాగు చేయాలా? వద్దా? అనే సందిగ్ధంలో పడుతున్నారు. గత ఏడాది సుమారు 92 లక్షల ఎకరాల్లో పంటలు సాగు కాగా, ప్రస్తుత వానాకాలంలో సుమారు 1.26 కోట్ల ఎకరాల్లో వివిధ పంటలు సాగైనట్లు అందించిన గణాంకాలు పేర్కొంటున్నాయి. ప్రస్తుత సీజన్‌లో వరి సాగు విస్తీర్ణం 57 లక్షల ఎకరాలకు పరిమితమైనట్లు సమాచారం. నీటి లభ్యతను దృష్టిలో పెట్టుకొని ఆరుతడి పంటల వైపు మళ్లాలని ప్రభుత్వం సూచిస్తున్నప్పటికీ, ఇప్పటికే బోర్లపై ఆధారపడి పెట్టుబడులు పెట్టిన రైతులు పంటలను కాపాడుకునేందుకు ఇబ్బందులు పడుతున్నారు. రబీ సాగు ప్రధానంగా బోరుబావులు, సాగునీటి వనరులపై ఆధారపడటంతో భూగర్భ జలాల పరిస్థితి కీలకంగా మారింది. వేసవి సమీపించే కొద్దీ నీటి డిమాండ్ పెరిగే అవకాశం ఉండటంతో పాటు విద్యుత్

..మిగతా 4వ పేజీలో ➔



ఉస్మానియా.. ఎందుకీ కష్టాలు?

పనిచేయని వైద్య పరికరాలు.. మందుల కొరతతో రోగుల అవస్థలు

రూ.కోట్లలో పెండింగ్ బకాయిలు.. నిలిచిన శస్త్రచికిత్సలు, వైద్య సేవలు



దశ, హైదరాబాద్: హైదరాబాద్‌లోని ఉస్మానియా ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్య సేవలపై నిధుల కొరత, మందుల సరఫరా సమస్యలు ప్రభావం చూపుతున్నాయన్న ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. నిత్యం వేలాది మంది పేద, మధ్యతరగతి రోగులు వైద్యం కోసం వచ్చే ఈ ఆసుపత్రిలో వైద్య పరికరాల మరమ్మతులు, మందులు, శస్త్రచికిత్సలకు అవసరమైన సామగ్రి అందుబాటుపై ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ఉచిత వైద్యంపై ఆధారపడే రోగులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు సమాచారం. ఆసుపత్రిలో ఎక్స్‌రే, సీటీ స్కాన్ వంటి వైద్య పరీక్షలకు సంబంధించిన యంత్రాల పనితీరుపై ఫిర్యాదులు వస్తున్నాయి. గుండె సంబంధిత చికిత్సలకు అవసరమైన క్యాథ్ ల్యాబ్, శస్త్రచికిత్సలకు ఉపయోగించే పరికరాలు, ఆర్థోపెడిక్ ఇంప్లాంట్లు, కుట్లు వేసేందుకు అవసరమైన సామగ్రి కొరతపై వైద్యులు ఆందోళన వ్యక్తం చేస్తున్నట్లు కథనాలు పేర్కొంటున్నాయి. పరికరాల కొరత, మరమ్మతుల ఆలస్యం కారణంగా కొన్ని వైద్య సేవలు ప్రభావితమవుతున్నాయన్న ఆరోపణలు ఉన్నాయి. ఆసుపత్రిలో

..మిగతా 4వ పేజీలో ➔

హ్యుందాయ్ కంపెనీ భారీ పెట్టుబడులు

మొదటి పేజీ తరువాయి

సంస్థ ప్రతినిధులు ముఖ్యమంత్రికి వివరించారు. తెలంగాణ భౌగోళికంగా దేశంలోని కీలక ప్రాంతాలకు అనుసంధానంగా ఉందని, హైదరాబాద్ సురక్షితమైన, నివాసయోగ్యమైన నగరంగా గుర్తింపు పొందిందని రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. రహదారులు, విమాన, రైలు మార్గాల ద్వారా మెరుగైన రవాణా సదుపాయాలు, ప్రత్యేక మొబిలిటీ క్లస్టర్లు పారిశ్రామిక అభివృద్ధికి దోహదపడతాయని చెప్పారు. పెరిఅర్బన్ రీజియన్ (PURE) వంటి ప్రాంతీయ అభివృద్ధి నమూనాలతో పాటు భారత్ ఫ్యూచర్ సిటీ ప్రణాళికలు పెట్టుబడులకు మరింత అనుకూల వాతావరణాన్ని కల్పిస్తాయని వివరించారు.2024 ప్రపంచ ఆర్థిక సదస్సు సందర్భంగా హ్యుందాయ్ ప్రతినిధులతో రాష్ట్ర ప్రభుత్వం చర్చలు జరిపింది. అనంతరం 2025 జూన్‌లో ప్రతిపాదిత ఆర్ అండ్ డీ కేంద్రానికి రాష్ట్ర మంత్రివర్గ పారిశ్రామిక, పెట్టుబడుల ప్రోత్సాహక ఉపసంఘం ఆమోదం తెలిపింది. ప్రస్తుతం హైదరాబాద్ హైటెక్ సిటీలో ఉన్న హ్యుందాయ్ ఇంజినీరింగ్ కేంద్రం వాహనాల పరిశోధన, అభివృద్ధి కార్యకలాపాలకు సేవలందిస్తోంది. జహీరాబాద్‌లో ఏర్పాటు చేయనున్న కేంద్రం వాహనాల పరీక్షలు, పనితీరు ధ్రువీకరణ, ఇంజినీరింగ్ ప్రక్రియల మెరుగుదలకు ఉపయోగపడనుంది. 2026లో నిర్వహించనున్న ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్‌కు హ్యుందాయ్ నాయకత్వ బృందాన్ని ముఖ్యమంత్రి ఆహ్వానించారు. తెలంగాణ అభివృద్ధిలో తమ భాగస్వామ్యాన్ని కొనసాగిస్తామని చాంగ్యోన్ చో తెలిపారు. సమావేశంలో సీఎం సలహాదారు, ఎక్స్‌అఫీషియో ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణారావు, సంగారెడ్డి జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ తదితర అధికారులు పాల్గొన్నారు.

కూలీలకు రూ.12 వేల సాయం, జీవిత బీమా కల్పించాలి

ఎల్‌నినో, నీటి కొరతపై ప్రభుత్వంపై కవిత విమర్శలు



దశ, హైదరాబాద్: ఎల్‌నినో ప్రభావం, రాబోయే నీటి కొరతను ఎదుర్కొనేందుకు రాష్ట్ర ప్రభుత్వం ముందస్తు చర్యలు చేపట్టడంలో విఫలమైందని తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత విమర్శించారు. వ్యవసాయ కూలీలకు ఏటా రూ.12 వేల ఆర్థిక సాయం అందించే పథకాన్ని తక్షణమే అమలు చేయాలని, వారికి జీవిత బీమా సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. బంజారాహిల్స్‌లోని పార్టీ కార్యాలయంలో మీడియాతో ఆమె మాట్లాడారు. ఎల్‌నినో ప్రభావంపై నిపుణులు ముందుగానే హెచ్చరించినప్పటికీ ప్రభుత్వం తగిన నివారణ చర్యలు చేపట్టలేదని కవిత ఆరోపించారు. పొరుగు రాష్ట్రాలు కరవు పరిస్థితులపై నివేదికలు సమర్పిస్తున్నాయని పేర్కొంటూ, తెలంగాణలోనూ పంట నష్టం, నీటి కొరతపై సమగ్ర కార్యాచరణ రూపొందించాలని కోరారు. రాబోయే పది నెలల్లో రాష్ట్రం తీవ్ర నీటి ఎద్దడిని ఎదుర్కొనే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి నెలలు గడుస్తున్నా గత ప్రభుత్వంపై నిందలు వేయడం సరికాదని కవిత వ్యాఖ్యానించారు. కరవు పరిస్థితుల నేపథ్యంలో వ్యవసాయ కూలీలకు ఆర్థిక భరోసా కల్పించడంతో పాటు వారి కుటుంబాలకు జీవిత బీమా రక్షణ కల్పించాలని డిమాండ్ చేశారు. యాదాద్రి పవర్ ప్లాంట్‌ను ప్రైవేటీకరించేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తోందని ఆమె ఆరోపించారు. ఈ అంశంపై ప్రైవేటు సంస్థలతో ఏవైనా ఒప్పందాలు జరిగాయా అని ప్రశ్నించారు. ఢిల్లీలో రాజ్యాంగ విలువల గురించి మాట్లాడుతున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, రాష్ట్రంలో మాత్రం అప్రజాస్వామికంగా వ్యవహరిస్తున్నారని కవిత విమర్శించారు.



హైదరాబాద్‌లో పాడ్ ట్యాక్సీలకు గ్రీన్ సిగ్నల్!

ఐటీ కారిడార్‌లో మూడు మార్గాలకు సీఎం రేవంత్ ఆమోదం

ట్రాఫిక్ తగ్గింపే లక్ష్యం.. కిలోమీటరుకు రూ.120-180 కోట్ల వ్యయం అంచనా

దశ, హైదరాబాద్: హైదరాబాద్‌లో ట్రాఫిక్ రద్దీని తగ్గించి, ప్రజా రవాణాను మరింత వేగవంతం చేసేందుకు తెలంగాణ ప్రభుత్వం పర్సనల్ ర్యాపిడ్ ట్రాన్సిట్ సిస్టమ్ (పీఆర్‌టీఎస్)ను ప్రవేశపెట్టే దిశగా అడుగులు వేస్తోంది. పాడ్ ట్యాక్సీలుగా పిలిచే ఈ వ్యవస్థకు సంబంధించి ప్రతిపాదించిన నాలుగు కారిడార్లలో ఐటీ ప్రాంతానికి సంబంధించిన మూడు మార్గాలపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సానుకూలంగా స్పందించారు. ప్రతి మార్గానికి మూడు ప్రత్యామ్నాయ ప్రణాళికలు రూపొందించాలని సంబంధిత సంస్థను ఆదేశించారు. రాయదుర్గం-కూకట్‌పల్లి, హైటెక్‌సిటీ-రాయదుర్గం నాలెడ్జ్ సిటీ, కొండాపూర్-ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్ మార్గాల్లో పీఆర్‌టీఎస్ ఏర్పాటుకు సంబంధించిన ప్రతిపాదనలను ముఖ్యమంత్రి పరిశీలించారు. ఈ మార్గాల్లో ఐటీ ఉద్యోగులు, ఇతర ప్రయాణికులకు సౌకర్యవంతమైన రవాణా అందించేలా ప్రత్యామ్నాయాలను అధ్యయనం చేయాలని సూచించారు. అసెంబ్లీ, లక్డీకాపూల్, సచివాలయం, ట్యాంక్‌బండ్ ప్రాంతాలను అనుసంధానించే నాలుగో కారిడార్‌లో సాంకేతిక సమస్యలు ఉన్నట్లు గుర్తించారు. ఈ మార్గాన్ని రాణిగంజ్ వరకు పొడిగించే అవకాశాలను మరింత లోతుగా పరిశీలించాలని అధికారులకు సూచించారు. పీఆర్‌టీఎస్ ప్రాజెక్టు నిర్మాణానికి కిలోమీటరుకు సుమారు రూ.120 కోట్ల నుంచి రూ.180 కోట్ల వరకు ఖర్చవుతుందని అంచనా వేస్తున్నారు. ప్రాజెక్టు రూపకల్పనలో ఆదాయం కంటే ప్రయాణికుల భద్రతకు ప్రాధాన్యం ఇవ్వాలని ముఖ్యమంత్రి స్పష్టం చేసినట్లు సమాచారం. మరోవైపు, పాతబస్తీతో పాటు నగరంలోని నాలుగు మెట్రో రైలు కారిడార్ల విస్తరణకు సంబంధించిన జనరల్ కన్సల్టెన్సీ టెండర్ల గడువును అధికారులు అక్టోబర్ 22 వరకు పొడిగించారు. గతంలో అక్టోబర్ 8 వరకు ఉన్న గడువులో ఆశించిన స్పందన రాకపోవడంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం.

ఎన్‌హెచ్-65 ఆరు లైన్ల విస్తరణకు ముహూర్తం ఫిక్స్!

2027 జనవరి నుంచి పనులు ప్రారంభించే లక్ష్యం

ట్రాఫిక్ కష్టాలకు చెక్.. ప్రయాణ సమయం, ప్రమాదాలు తగ్గే అవకాశం

దశ, హైదరాబాద్: హైదరాబాద్-విజయవాడ జాతీయ రహదారి (ఎన్‌హెచ్-65) విస్తరణకు రంగం సిద్ధమైంది. ప్రస్తుతం నాలుగు వరుసలుగా ఉన్న ఈ రహదారిని ఆరు వరుసలుగా అభివృద్ధి చేసేందుకు భారత జాతీయ రహదారుల ప్రాధికార సంస్థ (ఎన్‌హెచ్ఏఐ) చర్యలు చేపట్టింది. 2027 జనవరి నుంచి పనులు ప్రారంభించేలా లక్ష్యంగా పెట్టుకున్నట్లు రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి వెల్లడించారు. హైదరాబాద్ నుంచి చౌటుప్పల్, నల్గొండ, సూర్యాపేట మీదుగా విజయవాడకు వెళ్లే ఈ జాతీయ రహదారి తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ మధ్య కీలక రవాణా మార్గంగా ఉంది. నిత్యం వేలాది వాహనాలు రాకపోకలు సాగిస్తుండటంతో పలుచోట్ల ట్రాఫిక్ రద్దీ ఏర్పడుతోంది. పండుగలు, సెలవుల సమయంలో వాహనాల సంఖ్య పెరిగి ప్రయాణికులు గంటల తరబడి ఇబ్బందులు పడుతున్నారు. రద్దీ కారణంగా ప్రమాదాల ముప్పు కూడా పెరుగుతోంది. ఈ నేపథ్యంలో ఢిల్లీలో సోమవారం ఎన్‌హెచ్ఏఐ ఛైర్మన్ సంతోష్‌కుమార్ యాదవ్, ఇతర ఉన్నతాధికారులతో మంత్రి సమావేశమై రహదారి విస్తరణ, భద్రతా చర్యలపై చర్చించారు. ఆరు ప్రధాన రహదారి వరుసలతో పాటు సర్వీసు రోడ్లు, జంక్షన్ల అభివృద్ధి, పాదచారులు సురక్షితంగా రోడ్డు దాటేందుకు అండర్‌పాస్‌లు, అవసరమైన చోట నియంత్రిత ప్రవేశ సదుపాయాలు కల్పించడంపై దృష్టి సారించనున్నారు. విస్తరణ పనులు పూర్తయితే హైదరాబాద్-విజయవాడ మార్గంలో ట్రాఫిక్ రద్దీ తగ్గడంతో పాటు ప్రయాణం సులభతరం కానుంది. సరకు రవాణా వాహనాలకు కూడా ప్రయోజనం కలగనుంది.


రబీ సాగుపై నీలినీడలు!

మొదటి పేజీ తరువాయి

సరఫరాపైనా ఒత్తిడి పెరగవచ్చన్న ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. ఈ పరిస్థితుల్లో గత సీజన్‌తో పోలిస్తే యాసంగి సాగు విస్తీర్ణం తగ్గే అవకాశముందని వ్యవసాయ వర్గాలు భావిస్తున్నాయి. మరోవైపు, ఖరీఫ్‌లో నష్టపోయిన రైతులు తిరిగి పెట్టుబడులు పెట్టేందుకు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రత్యామ్నాయ పంటలు సాగు చేసినా గిట్టుబాటు ధర లభిస్తుందనే భరోసా లేకపోవడం, మార్కెటింగ్ సదుపాయాలపై అనిశ్చితి వారిని మరింత ఆందోళనకు గురిచేస్తోంది. ఈ నేపథ్యంలో కొన్ని ప్రాంతాల్లో క్రాప్ హాలిడే ప్రకటించాల్సిన పరిస్థితులు వస్తాయనే చర్చ సాగుతోంది. ప్రభుత్వం పంటల వారీగా నీటి లభ్యతను అంచనా వేసి రైతులకు స్పష్టమైన సాగు ప్రణాళిక అందించాలని రైతు వర్గాలు కోరుతున్నాయి. పంట నష్టాలపై సమగ్ర సర్వే నిర్వహించి అర్హులకు పరిహారం అందించాలని, విద్యుత్ సరఫరాను క్రమబద్ధీకరించాలని విజ్ఞప్తి చేస్తున్నాయి. నీటిని పొదుపుగా వినియోగించే సాగు పద్ధతులను ప్రోత్సహించడంతో పాటు ప్రత్యామ్నాయ పంటలకు మార్కెటింగ్ భరోసా కల్పించాలని సూచిస్తున్నాయి. రానున్న యాసంగి సీజన్‌లో రైతులపై భారం మరింత పెరగకుండా ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకుంటుందో వేచి చూడాలి.

ఉస్మానియా.. ఎందుకీ కష్టాలు?

మొదటి పేజీ తరువాయి



కార్డియాలజీ, గ్యాస్ట్రోఎంటరాలజీ సహా పలు సూపర్ స్పెషాలిటీ విభాగాలు ఉన్నప్పటికీ, అవసరమైన పరికరాలు, సామగ్రి అందుబాటులో లేకపోతే రోగులకు పూర్తిస్థాయి చికిత్స అందించడం కష్టంగా మారుతుంది. అత్యవసర పరిస్థితుల్లో ఇతర ఆసుపత్రులకు రోగులను పంపాల్సి వస్తే వారికి అదనపు ఇబ్బందులు ఎదురవుతాయి. శస్త్రచికిత్సల నిర్వహణలో సమస్యలు వైద్య విద్యార్థుల శిక్షణపైనా ప్రభావం చూపే ప్రమాదం ఉంది. మందులు, శస్త్రచికిత్సలకు అవసరమైన సామగ్రిని సరఫరా చేసే సంస్థలకు బిల్లులు పెండింగ్‌లో ఉండటమే ప్రస్తుత సమస్యలకు కారణాల్లో ఒకటిగా పేర్కొంటున్నారు. ఉస్మానియా ఆసుపత్రి నుంచి సుమారు రూ.35 కోట్ల బకాయిలు రావాల్సి ఉందని సరఫరాదారులు చెబుతున్నట్లు సమాచారం. బకాయిలు చెల్లించకపోవడంతో సరఫరాలను నిలిపివేసినట్లు ఆరోపణలు ఉన్నాయి. అయితే బకాయిలకు సంబంధించిన పూర్తి వివరాలు, నిధుల విడుదలపై అధికారిక ధ్రువీకరణ అవసరం. ఉస్మానియా ఆసుపత్రితో పాటు అనుబంధ ప్రభుత్వ ఆసుపత్రుల్లోనూ మందులు, వైద్య సామగ్రి సరఫరా సమస్యలను పరిష్కరించాలని వైద్య వర్గాలు కోరుతున్నాయి. పెండింగ్ బిల్లులను పరిశీలించి నిధులు విడుదల చేయడంతో పాటు పనిచేయని పరికరాలకు మరమ్మతులు చేయించాలని, అత్యవసర మందులు, శస్త్రచికిత్స సామగ్రి నిరంతరం అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నాయి. ప్రభుత్వ ఆసుపత్రులపై ఆధారపడే నిరుపేదలకు నాణ్యమైన వైద్యం అందించడం అత్యంత కీలకం. ఉస్మానియా ఆసుపత్రిలో నెలకొన్న సమస్యలపై ప్రభుత్వం, వైద్య ఆరోగ్యశాఖ అధికారులు స్పందించి వాస్తవ పరిస్థితులను సమీక్షించాలి. నిధులు, పరికరాలు, మందుల కొరతకు శాశ్వత పరిష్కారం చూపితేనే రోగులకు మెరుగైన వైద్య సేవలు అందే అవకాశం ఉంటుంది.

విజయ పాల ధరల పెంపు

అక్టోబర్ 17 నుంచి కొత్త ధరలు అమల్లోకి..

దశ, హైదరాబాద్ : తెలంగాణలోని ప్రముఖ ప్రభుత్వ రంగానికి చెందిన విజయ డెయిరీ తమ పాల ధరలను పెంచుతూ కీలక నిర్ణయం తీసుకుంది. పెరిగిన లీజింగ్, రవాణా, ప్యాకేజింగ్ ఖర్చులతో ఈ ధరల సవరణ చేపట్టినట్లు తెలుస్తోంది. ఈ కొత్త పాల ధరలు అక్టోబర్ 17 నుంచి రాష్ట్రవ్యాప్తంగా అమల్లోకి రానున్నాయి. అంటే అక్టోబర్ 16 రాత్రి నుంచి సప్లైలకు కొత్త ధరలు వర్తించనున్నాయని ఆ ప్రకటనలో తెలిపింది.ఈ విడతలో విజయ డెయిరీ ముఖ్యంగా స్టాండర్డైజ్డ్ మిల్క్, హోల్ మిల్క్ రకాలపై ధరలను సవరించింది. లీటరు చొప్పున కాకుండా ప్రతీ 500 ఎంఎల్ (అర లీటరు) ప్యాకెట్‌పై రూ. 1 చొప్పున పెంచారు. దీని ప్రకారం, ఇప్పటివరకు రూ.34కి లభించే 500 ఎంఎల్ స్టాండర్డైజ్డ్ మిల్క్ ప్యాకెట్ ధర ఇకపై రూ.35 అవుతుంది. రూ.39గా ఉన్న 500 ఎంఎల్ హోల్ మిల్క్ ప్యాకెట్ ధర రూ.40 అయింది. దాంతో వినియోగదారులు అక్టోబర్ 17 నుంచి ఈ కొత్త సవరించిన ధరల ప్రకారమే కొనుగోలు చేయాల్సి ఉంటుంది. మరిన్ని వివరాల కోసం హెల్ప్ లైన్ నెంబర్ 040 27019851, 27019854 లలో సంప్రదించాలని సూచించారు.



ఆక్సీ-నౌ ప్లాంట్‌లో సిలిండర్ పేలుడు

మొదటి పేజీ తరువాయి

ఘటనా స్థలాన్ని పరిశీలించారు . పోలీసులు ప్రమాదానికి గల కారణాలపై విచారణ చేపట్టినట్లు పేర్కొంది. పారిశ్రామికాభివృద్ధితో పాటు కార్మికుల ప్రాణాల రక్షణకు కూడా సమాన ప్రాధాన్యం ఇవ్వాలి. ఈ ఘటనలో మృతుడి కుటుంబానికి తగిన సహాయం అందించడంతో పాటు, గాయపడిన కార్మికులకు మెరుగైన వైద్యం అందేలా చర్యలు తీసుకోవాలి. పరిశ్రమల్లో భద్రతా ప్రమాణాల అమలుపై అధికారులు పర్యవేక్షణ పెంచి, ఇలాంటి ప్రమాదాలు పునరావృతం కాకుండా చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉంది.

మార్నింగ్ వాక్‌లో మృత్యుఘోష!

మొదటి పేజీ తరువాయి

పొందుతూ నాగరాజు మృతి చెందగా, జానయ్యకు అత్యవసర విభాగంలో చికిత్స కొనసాగుతోంది. ఒకే గ్రామానికి చెందిన ఇద్దరు మృతి చెందడంతో బలేంలలో విషాదం అలుముకుంది. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ప్రమాదానికి కారణమైన డీసీఎం వాహనాన్ని, డ్రైవర్‌ను గుర్తించేందుకు చర్యలు చేపట్టినట్లు సమాచారం.

పంట నష్టానికి ఎకరాకు 10 వేల పరిహారం?

మొదటి పేజీ తరువాయి

అధికారిక ప్రకటన వెలువడాల్సి ఉంది. రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో వర్షాభావ పరిస్థితుల కారణంగా పంటలు ఎండిపోవడం, దిగుబడులు తగ్గడంతో రైతులు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ నేపథ్యంలో పంట నష్టం అంచనా, రైతులకు అందించాల్సిన సహాయం, కరువు నివారణ చర్యలపై ప్రభుత్వం సమీక్షించే అవకాశం ఉంది. జిల్లాలవారీగా పంట నష్టం వివరాలను సేకరించి, క్షేత్రస్థాయిలో పరిస్థితులను అంచనా వేయడం కీలకంగా మారింది. పంట నష్టంపై కేంద్ర ప్రభుత్వానికి నివేదిక సమర్పించి, అవసరమైన ఆర్థిక సాయం కోరే అంశాన్ని కూడా ప్రభుత్వం పరిశీలించవచ్చని సమాచారం. నష్టపరిహారం అమలులోకి వస్తే అర్హులైన రైతులకు నేరుగా బ్యాంకు ఖాతాల్లో నగదు జమ చేసే విధానాన్ని అనుసరించే అవకాశం ఉంది. అయితే ఎకరాకు రూ.10 వేల పరిహారం, అఖిలపక్ష సమావేశం, నిధుల విడుదల వంటి అంశాలపై ప్రభుత్వం నుంచి అధికారిక ధ్రువీకరణ రావాల్సి ఉంది. రైతులకు అందించే సాయం, అర్హతలు, సర్వే విధానం, పంపిణీ కాలపరిమితిపై స్పష్టత కోసం రైతాంగం ఎదురుచూస్తోంది.

కాంగ్రెస్ నిర్లక్ష్యంతోనే నీటి ఎద్దడి!

మొదటి పేజీ తరువాయి

ద్వారా నీటిని వినియోగించుకుంటోందని, తెలంగాణ తన నీటి వాటాను కాపాడుకోవడంలో విఫలమైందని ఆరోపించారు. ప్రాజెక్టుల నిర్వహణ, నీటి నిల్వలు, సాగు, తాగునీటి అవసరాలపై ప్రభుత్వం తక్షణమే దృష్టి సారించాలని డిమాండ్ చేశారు.

ఫేక్ ఏరోస్పేస్ కంపెనీలకు తెలంగాణ అడ్డా?

తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో నకిలీ ఏరోస్పేస్, డిఫెన్స్ కంపెనీలు ఏర్పాటవుతున్నాయని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆరోపించారు. ఈ వ్యవహారంపై కేంద్ర రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ తక్షణమే విచారణకు ఆదేశించాలని డిమాండ్ చేశారు. సోషల్ మీడియా వేదికగా స్పందించిన కేటీఆర్.. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కుటుంబానికి సంబంధం ఉందని పేర్కొన్న టెసరాక్ట్, మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి కుటుంబానికి సంబంధం ఉందని ఆరోపించిన రాఘవ ఏరోస్పేస్, ఐంద్రి డిఫెన్స్ సంస్థల పేర్లను ప్రస్తావించారు. ఈ సంస్థల కార్యకలాపాలపై అనుమానాలు వ్యక్తం చేస్తూ సమగ్ర విచారణ జరపాలని కోరారు. రక్షణ రంగానికి పరికరాలు, సమాచారం సరఫరా చేసే సంస్థల విషయంలో పారదర్శకత, భద్రతా ప్రమాణాలు అత్యంత కీలకమని కేటీఆర్ పేర్కొన్నారు. ఆయా సంస్థలకు సంబంధించిన వ్యవహారాలను కేంద్ర నిఘా సంస్థలు పరిశీలించి వాస్తవాలను వెలికితీయాలని కోరారు.

Printed, Published and Owned by B.KALPANA and Printed at Kalpana Publications , Flat No.101,Sri Heights Apartment,Shilpi Colony,Pasumamula Road,Pedda Amberpet,Rangareddy,Telangana-501505, and Published at Flat No.101,Sri Heights Apartment,Shilpi Colony,Pasumamula Road,Pedda Amberpet,Rangareddy,Telangana-501505. Editor: B.KALPANA. PRGI.No.TGTEL/25/A4195. Cell 9848288850, namasteshekar@gmail.com